# వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ బిజీ



సాగుకు సిద్ధం చేసిన వ్యవసాయ క్షేత్రం

బాన్సువాడ, డిసెంబర్ 4 : బాన్సువాడ నియోజకవర్గంలో వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ బిజీ అయ్యారు. వానకాలం ముగిసిన వెంటనే యాసంగి పంటలు వేసేందుకు రైతులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు, ఒకవైపు పంటపొలాల్లో యాసంగి దుక్కులు దున్నడంతోపాటు నారుమడులు వేసి సిద్ధం అయ్యారు. మరో 15 రోజుల్లో రైతులు నాట్లు వేసేందుకు సిద్ధం అవుతున్నారు. ముఖ్యంగా డిసెంబర్ మాసంలో నాట్లు వేయడంతో రాబోవు మార్చి నెలలో కోతదశకు వస్తాయని, రాళ్ల వానలు, చెడగొట్టు వాన నుంచి బయట పడొచ్చని రైతులు ముందస్తుగా వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు.

## టీఆర్‌టీఎఫ్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

కామారెడ్డి, డిసెంబర్ 4 : టీఆర్‌టీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడుగా బషీర్, కార్యదర్శిగా రాజేశ్వర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కౌన్సిలర్లుగా ప్రసన్నకుమార్, సంతోష్, రాష్ట్ర కార్యదర్శిగా అజ్మత్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తన వంతు బాధ్యతగా కృషి చేస్తామన్నారు. పీఆర్సీ అమలు, 317 జీవో ద్వారా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఆగిపోయిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, సీపీఎస్ రద్దు వంటి విషయాలను నూతన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు.

## వాహనాల తనిఖీ



రాజంపేట శివారులో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

బీబీపేట్/రాజంపేట్ డిసెంబర్ 4 : బీబీపేట్, జనగామ రోడ్డులో ఎస్సై సాయిరెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది సోమవారం వాహనాలను తనిఖీ చేశారు. వాహనదారులను ఆపి వాహనాలకు సంబంధించిన ధ్రువ పత్రాలను పరిశీలించారు. సరైనా ధ్రువపత్రాలు లేని 20 మంది వాహనదారులకు జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ మల్లేశం, సిబ్బంది ప్రవీణ్, రవీందర్, నవీన్‌కుమార్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు. రాజంపేట మండల శివారులో పోలీసు సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్ ధరించని, సరైన ధ్రువపత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని పోలీసులు సూచించారు.

## జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య

బీబీపేట్, డిసెంబర్ 4 : జీవితంపై విరక్తితో గడ్డి మందు తాగి సోమవారం ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రచారం.. బీబీపేట మండల కేంద్రానికి చెందిన దొంతుల సిద్ధరాములు(54) ఆరు నెలల నుంచి దమ్ము, పక్షవాతంతో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది బీబీపేటలోని వడ్డ కుప్ప వద్ద గడ్డి మందు తాగాడు. స్థానికులు గమనించి వెంటనే దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు చెప్పారు. మృతుడి తల్లి రాజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## కార్తీక మాసం ప్రత్యేక పూజలు



గైని గుట్టల బసవేశ్వర ఆలయంలో అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

రుద్రూర్, డిసెంబర్ 4 : రుద్రూర్ మండలంలోని గైని గుట్టల బసవేశ్వరాలయంలో సోమవారం కార్తీక మాసం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని పలు ఆలయాల్లో అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ పూజారి పరమేశ్ మహారాజ్ తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహిస్తారని తెలిపారు.

## పోచారం గెలుపునకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు

### బాన్సువాడ సొసైటీ చైర్మన్ ఏర్వాల కృష్ణారెడ్డి

బాన్సువాడ టౌన్, డిసెంబర్ 4: బీఆర్ఎస్ బాన్సువాడ నియోజకవర్గ అభ్యర్థి పోచారం శ్రీనివాసరెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందారు. పోచారం గెలుపునకు కృషి చేసిన నియోజకవర్గంలోని నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, బీఆర్ఎస్ శ్రేణులకు, ప్రతి ఒక్కరికీ పేరుపేరున బాన్సువాడ సొసైటీ చైర్మన్ ఏర్వాల కృష్ణారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

**కోటగిరి మండల నాయకులు..**

కోటగిరి, డిసెంబర్ 4 : బీఆర్ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాసరెడ్డి గెలుపునకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. కోటగిరి మండలంలోని నాయకులు, కార్యకర్తలు, బీఆర్ఎస్ శ్రేణులు, ఓటర్లకు ఉమ్మడి కోటగిరి మండల ఎంపీపీ వల్లెపల్లి సునీత శ్రీనివాసరావు, జడ్పీటీసీ సభ్యుడు శంకర్‌పటేల్, మండల అధ్యక్షుడు ఎజాజ్‌ఖాన్, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు సిరాజ్, ఏఎంసీ చైర్మన్ మహ్మద్ అబ్దుల్ హమీద్, రైతుబంధు సమితి మండల కన్వీనర్ కొల్లూర్ కిశోర్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు మంచి పను లు చేసే వారి వెంట ప్రజలు ఎల్లప్పుడు ఉంటారని, ఈ విజయం ప్రజలందరిదని వారు తెలిపారు. పోచారం శ్రీనివాసరెడ్డి గెలుపుతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# చివరి దశకు చేరుకున్న ధాన్యం కొనుగోళ్లు

భిక్కనూరు, డిసెంబర్ 4 : మండలంలో నెల రోజుల క్రితం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ చివరి దశకు చేరుకున్నదని భిక్కనూరు మండల వ్యవసాయాధికారిణి రాధారెడ్డి సోమవారం తెలిపారు. భిక్కనూరుతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతున్నాయని చెప్పారు. రైతులందరూ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో సింగిల్ విండోల పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. వాటి ద్వారా రైతులు పండించిన ధాన్యాన్ని సేకరిస్తున్నట్లు తెలిపారు. ధాన్యం నూర్పిళ్లు త్వరగా చేపట్టాలని కొనుగోలు కేంద్రాలకు తరలించి మద్దతు ధరకు విక్రయించు కోవాలని సూచించారు.



భిక్కనూరులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని తూకం వేస్తున్న హమాలీలు

## నేడు వర్ని మండల సర్వసభ్య సమావేశం

వర్ని, డిసెంబర్ 4 : వర్ని మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బషీరుద్దీన్ తెలిపారు. ఎంపీపీ మేక శ్రీలక్ష్మి వీర్రాజు అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో మండలంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అధికారులు, సభ్యులు సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక

చందూర్, డిసెంబర్ 4 : మండల కేంద్రంలో సోమవారం మోటాడి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శేషగారి శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా కొత్తోల్ల సాయారెడ్డి, కార్యదర్శిగా కొన్నెల రాంరెడ్డి, కోశాధికారిగా అర్గుల శ్రీనివాస్‌రెడ్డిని ఎన్నుకున్నట్లు సంఘ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు కారుగం శ్రీనివాస్‌రెడ్డి, మాదరపు రాజారెడ్డి, ఆర్ల శంకర్‌రెడ్డి, కల్లూరి జలేందర్‌రెడ్డి, అచ్చన్నగారి గోపాల్‌రెడ్డి, అంబెపు సాయారెడ్డి తదితరులు పాల్గొన్నారు.